

# నన్ను బతికించుకోండి!

నాకు ఇప్పటికీ ఆశ్చర్యంగానే ఉంటుంది! ఏమిటిది? ఏమిటి జరిగిపోతోంది? ముప్ఫయి అయిదేళ్ల వయసు నాకు. ఇలాటి ఆటుపోటులెన్నిటినో తట్టుకొని కదలిపోవాల్సిన వయసు. కాని ఏమిటో భయం. జీవితం ఏ మలుపు తిరుగుతుందోనని ఆందోళన. తెల్లవారేలోపే జీవితం తెల్లవారి పోతుందేమోనన్న ఆత్రుత!

రెండు పగటి వేళల మధ్య సంధ్యా సమయం అది! ఖచ్చితంగా అర్ధరాత్రి. ఎవరో కత్తితో నన్ను వెంటాడుతున్న భావన. ఈ భావన చీకటి పడడంతో ఆరంభం అవుతుంది. క్రమంగా చీకటి చిక్కపడుతున్న కొద్దీ భయం పెరుగుతూ వస్తుంది. అర్ధరాత్రి... దూరంగా ఉండే ఆ ఠాణాలో... గంటలు ఒకటొకటిగా పన్నెండు కొట్టేసరికి, గుండెల్లో ఆవేదన అధికమయిపోతుంది. ఈ భయం నిజానికి ఇటీవలే ఆరంభమైంది. అంతక్రితం... అంత క్రితం ఉండేది కాదు. మిగతా ప్రపంచంతో పాటుగా చీకటి చిమ్ముకొంటున్న వేళకు గుండెల మీదకు చెయ్యి చేర్చుకొని హాయిగా నిద్రపోయే స్థితి ఉండేది నాకు.

అసలేమిటో.. ఈ రోజున ఆలోచిస్తోంటే అనిపిస్తోంది. నాకూ, ఈ అర్ధరాత్రికీ చెప్పలేని అనుబంధం ఉంది. అసలు నా పుట్టుకే ఆ గడియలో జరిగింది. నా చుట్టూ ప్రపంచం నిద్రపోతున్న వేళ పుట్టాను నేను. మేళతాళాల మధ్య, ఆనందోత్సాహాల మధ్య, మేడలు మిద్దెలు గుడులు, గుడిసెలు, మసీదులు మనుషులూ, అన్నీ అందరూ ఆదరంతో ఆహ్వానించే క్షణాలలో పుట్టాను నేను.

అంతవరకూ ప్రపంచంలో నిద్రపోతున్న ఎందరో నేను ఆనందంతో వేసిన కేకలకు ఉలిక్కిపడి లేచారు. తామేదో వెనుకబడి పోయామన్న ఆందోళనతో ఉన్నట్లుండి లేచి రంకెలు వేయనారంభించారు. అసలు ఆ తర్వాతే వాళ్ళు నిజంగా బతకగలిగారంటే అబద్ధమూ కాదు, అంతటి చరిత్ర సృష్టించిన జన్మ నాది.

ఇప్పుడు భయంతో, బాదరబందీతో బాధతో ఉక్కిరి బిక్కిరి అయిపోతోంది.

రోజు గడిచి రోజు వస్తున్న కొద్దీ, ఏటిమీద మరో ఏడు ముంచుకొస్తున్న కొద్దీ ఈ భయం పెరుగుతోంది.

పుట్టిన పసిగుడ్డులా ఉన్న క్షణాల్లో తాతగారి ఒళ్ళో రవ్వంత విశ్రాంతి తీసుకోదలిచాను. తాతయ్యదంతా అదో రకం మనస్తత్వం. నేను పుట్టనంతసేపూ నానాగోల పెట్టేశాడట. ఊరువాడా ఏకం చేసి నాకు జన్మనిచ్చాడని చెప్పాలి. అలాటిది నేను పుట్టగానే ఏమిటో, నిజంగా నాకు పుట్టిన సంతోషమే లేకుండా చేసిపోయాడు. తాతా, ఆప్యాయంగా నన్ను లాలించి పెంచు అని చెప్పగలిగే వయసూకాదు నాది. కానీ తాతయ్య అర్థం చేసుకోవాల్సిందిపోయి, నాపట్ల చిన్న చూపే చూసాడు, లేకపోతే అక్కడెక్కడో దాయాదులు నలుగురు కొట్టుకుంటున్నారని వెళ్లిపోతాడా? వెళ్ళి ఏం బావుకొన్నాడు? గుండెల్లోకి చూసి వారే గునపాలు గుచ్చి వదిలారు. 'మా గొడవలు మావి. వయస్సు మళ్ళిన ఎముకలు కుళ్ళినవాడివి, నువ్వేం తీరుస్తావ్?' అంటూ స్పష్టంగా అడిగి మరీ సాగనంపారు. 'ఇది నేను సంపాదించిన ఆస్తిరా. నా ముందే దాన్ని కుక్కలు చింపిన విస్తరిచేయకండిరా' అని నయానభయాన చెప్పి చూసినా లాభం లేకపోయింది. ఆఖరికి తాతయ్య ఒడిలో రవ్వంత అయినా నిద్రించే సుఖం నేను పొందకనే, తాతయ్య వెళ్ళిపోయారు.

అప్పటికే బాబయ్యతో బాగా పరిచయం అయిపోయింది. బాబయ్యను చూస్తే నాకెంతో ప్రేమ. చిన్నతనంలో నన్ను చేరదీసిన వ్యక్తి. నా వ్యక్తిత్వాన్ని తీర్చి దిద్దేటందుకు బాబయ్య

చెప్పలేనంత అవస్థ పడ్డాడు. ఎన్నో పునాదులు వేసి జాగ్రత్తపడ్డారు. ఒక్కో సంఘటన ఆధారం చేసుకొంటూ నా భవిష్యత్తు జీవితాన్ని సజావుగా గడిపేలా అవసరమైన చోట కంచెలు పెట్టాడు. అక్కర్లేదనుకొన్నచోట పూలబాటలు పరిపించాడు.

బాబయ్య వ్యక్తిగతంగా ఎంతో మంచివాడు. కాదనను. కానీ, ప్రతీ గురివెందకు ఒకవైపు కొంచెం నలుపు ఉంటుందట. ఎంతటి గొప్పవాడికైనా రవ్వంత బలహీనత ఉండి తీరుతుంది కాబోలు! బాబయ్యకు ఓ కూతురు ఉండేది. మంచిదే అనుకున్నాను! బాబయ్యకు ఆ కూతురంటే, చెప్పలేనంత ప్రేమాభిమానాలు. కాకి పిల్ల కాకికి ముద్దు, బాబయ్య కూతురు బాబయ్యకు ముద్దు అనుకున్నాను.

బాబయ్య కూతురు నా పట్ల ఎంతో ప్రేమ ప్రకటించేది. చేరదీసేది. అంతటి ఆప్యాయత నన్ను ఆకట్టుకొంది. అందుకే నేనూ సాదరంగానే చేరదీశాను. కోరినవన్నీ అందించాను. అందలం ఎక్కించే ఉద్దేశాన్ని పెంచుకొన్నాను. కానీ బాబయ్య ఉన్నంతకాలమూ అది జరిగే పనికాదు అని నాకు తెలుసు. అలాగే జరిగింది కూడా.

బాబయ్య ఓ రోజు మధ్యాహ్నం విశ్రాంతి తీసుకొంటూ ఉన్న క్షణాలలోనే శాశ్వత విశ్రాంతికై కన్ను మూసారు. ఆస్తి పెత్తనం బాబయ్య కూతురుమీద పడింది. బాబయ్య నేర్పించిన నడక, ఎక్కడా తప్పటడుగులు లేకుండా వస్తున్న నడక ఇకపైనా అలాగే ఉంటుంది, అని హాయిగా నిట్టూర్చుకోగలిగాను. కానీ... అదిగో, అక్కడే వేశాను పప్పులో అడుగు. ఏం జరిగిందని అడగరేం? చెప్పేస్తాను! బాబయ్య కూతురు తెలివైంది. అందమైంది. చదువుకొంది. ఇన్ని లక్షణాలు... పైగా చేతికి అంది వచ్చిన ఆస్తి... ఇన్నీ ఒకే చోట కూడటం తప్పన్న సంగతి గ్రహించలేకపోయాను. పెత్తనం అంతా అమ్మాయిదే గదానన్న ధైర్యంతో నిద్రపోవటం అలవాటు చేసుకొన్నాను. ఆ ప్రమత్తతే నా కొంప తీస్తుందని ఊహించుకోలేకపోయాను.

ఓ రోజు సరిగ్గా అర్ధరాత్రి వేళ... ఉలిక్కిపడి నిద్రలేచాను. ఎక్కడో ఏదో చప్పుడు, చిన్న అలికిడి. ఎలకలేవో నిశ్శబ్దంగా కన్నం తవ్వుతున్న భావన, జాగ్రత్తగా పరిశీలించాను. లంకంత ఇల్లు. ఏమూల ఏం జరుగుతుందో గ్రహించటమూ కష్టమే అయినా కళ్ళు దీపాలు చేసుకొని వెతికాను. అప్పుడు ఆ లంకంత కొంపలో భోషాణంలాంటి ఆ గదిలో ఆ మూల ఎత్తు కుర్చీలో కూర్చున్న బాబయ్య కూతురు, ఎదురుగా ఆమె దుడుకు కొడుకు! వాళ్ళిద్దరూ ఎదురుగా రాసులు పోసిన నగలు, నోట్లు!

ఉలిక్కిపడ్డాను. గుండెల్లో చెమట. ప్రాణాలలో నిస్సత్తువ. కొంపను ఇలా నిలువునా దోచుకుంటున్నారా ఈ అర్ధరాత్రి దొంగలు! అయినా ఎక్కడిది ఇంత సంపద? నిజానికి ఇదంతా నాది కదూ? నాదన్న వస్తువు నాకు తెలీకుండానే నా చేతిలోంచి జారిపోతోందా?

ఇంత సంపదా ఒక్కసారి చూస్తే ఆ దుడుకు పిల్లాడు ఊరుకోగలడా? అసలే సర్వలక్షణ శోభితుడు. ఇక లక్ష్మీ ప్రసన్నంకూడా జరిగితే.. ఇంకేముంది ఇల్లు గుల్ల. ఒళ్ళు గుల్ల.

తెలిసో, తెలియకో బాబయ్య కూతురు చేస్తున్న పని నా ఉనికికి ఎసరు పెట్టేలా ఉంది. జాగ్రత్తగా ఉండకపోతే అసలు నేనే అయిపులేకుండా అయిపోతాను.

రోజూ ఇంట్లో నాణాలమోత... నా గుండెల్లో భయాల ప్రతిధ్వనులు, అర్ధరాత్రి అవుతోందంటే ఆ తల్లీ కొడుకులు ఏం ఆలోచిస్తారో? ఆ మెదడులో ఏ పిశాచాలు తిరుగుతాయో గ్రహించలేని దౌర్భాగ్య స్థితికి చేరుకొన్నాను నేను.

ఎంత చీకటిలోనైనా ఒక కాంతి కిరణం ఉండే ఉంటుందంటారు. ఎటొచ్చీ అటువైపు చూడగలిగే అదృష్టానికి పెట్టి పుట్టాలి మనం. నా పరిస్థితి అలాగే అయిపోయింది. ఏ దేవుడికి మొరపెట్టుకోవాలి అని ఆలోచించి ఆందోళన చెందానే కానీ గుమ్మంలోనే ఉన్న గుండెలున్న చిన్న తాతయ్య సంగతి మర్చేపోయాను.

ఎవరికీ చెప్పా పెట్టాకుండానే పయనం కట్టాను. చిన్న తాతయ్య నన్ను ఆదరంగా దగ్గరకు తీసుకున్నాడు. చెప్పిన కష్టాలన్నీ సావకాశంగా విన్నాడు. నాతోపాటు కన్నీరు కార్చాడు. నా కష్టాలు తీర్చి నా కన్నీరు తుడిచేందుకు వస్తాను పదమన్నాడు. కొండంత అండతో తల్లీ కొడుకుల్నీ ఎదుర్కోగలనన్న ధైర్యంతో తిరిగి వచ్చాను. ఇంటికొచ్చి చిన్న తాతయ్య చనువుతో ఆ తల్లీ కొడుకుల్ని మందలించాను. నన్ను జాగ్రత్తగా చూసుకోమని సలహా ఇచ్చాడు. సలహాలన్నీ వింటూనే కాలం గడిపారు.

ఉదయం.. మధ్యాహ్నం అయింది. మధ్యాహ్నం సాయంత్రం అయింది. సాయంత్రం రాత్రి అయింది. అర్ధరాత్రీ అయింది. అప్పుడొచ్చింది ఆ నిశాచరులకు అంత బలం. పాలేళ్ళను పిలిచి చిన్న తాతయ్యను కొట్టించారు. నన్ను పిలిచి కొట్టంలో పారేసి బయట గొళ్ళెం పెట్టేశారు నాకన్నా వయోవృద్ధుడు, జ్ఞానవృద్ధుడు చిన్న తాతయ్యకు నా మీది అభిమానంవల్ల కలిగిన అవమానం నాకు తల కొట్టేసినట్లయింది. సిగ్గు పడ్డాను. కించపడ్డాను.

దెబ్బలు తినేసిన చిన్న తాతయ్య ఊర్కుండి పోలేదు. తన బలగాన్ని అంతా తెచ్చి నన్ను విడిపించేందుకు అహోరాత్రులూ పోరాటం సాగించాడు. ఆఖరికి గెలిచాడు. నన్ను విడిపించగలిగాడు, చీకటి కొట్టంలో ఒరిగిపోవాల్సిన నాకు పునర్జన్మనిచ్చాడు. బతికిపోయాను అనుకొన్నాగానీ చిన్నతాతయ్య నాకు కాపలాగా పెట్టిన దౌర్భాగ్యులూ అలాటివారే. కళ్ళు తెరిచేలోగా మళ్ళీ ఆ తల్లీ కొడుకులే నా పాలిట దాపురించారు.

నన్ను ఇప్పుడు వాళ్ళకంటికి రెప్పలా కాపాడుతున్నారు. ఏ మాత్రం అలుసు ఇచ్చినా పారిపోతానేమోనని ప్రతీ దినమూ పరిస్థితి అంచనా వేసుకొంటూ అవసరం అనుకొంటే కొరడా దెబ్బలు అర్ధరాత్రి వేళ అందిస్తూ నా చుట్టూ గిరి గీస్తున్నారు. ముప్ఫయి అయిదేళ్ళ వయసు వచ్చేసింది నాకు! నిజానికి ఇదో వయసుకాదు. ఉత్సాహం వెల్లి విరియాల్సిన వయసు ఇది. ధైర్యం పొంగులు వారాల్సిన వయసు ఇది. కానీ, గుండెల్లో గుబులు... ఎలాగైనా బతికి తీరాలనే కాంక్ష... ఆ కాంక్షతోనే బతికి పోతున్నాగానీ, అలా మనోధైర్యంతోనే మనుగడ సాగిస్తున్నాగానీ...

లేకుంటేనా?

కేవలం.. ఇలా బతుకుభయంతో ఎంతకాలం బతికి బట్ట కట్టగలనో అన్న వేదనా ఉంది, ఆవేదనా ఉంది. చీకటి పడుతోందంటేనే.. చీకటి పడుతోందన్న భయం కలుగుతుంది. అర్ధరాత్రి అయితీరుతుందన్న బాధ ఉంది. ఆ అర్ధరాత్రి సమయంలో ఏ సందు చూసుకొని ఏ ఆయుధంతో నా మీద ఆ తల్లీ కొడుకులు విరుచుకొని పడతారో అన్న జంకూ ఉంది. ఏ అర్ధరాత్రి తర్వాత నా జీవితం కడపటి అంకానికి చేరిపోతుందోనన్న గొంకూ ఉంది.

అయితే ఇంతటి జంకుగొంకుల మధ్య, భయాందోళనల మధ్య, నాకు కనపడని కాపలాగా కోట్లాది జనం నాకు అండగా ఉన్నారనే నమ్మకం ఒక్కటే నన్ను బతికిస్తోంది. కత్తితో నన్ను వెంటాడుతున్న వ్యక్తి ఏదో ఒక రోజు ఆ కత్తికే బలి అయిపోతాడనే నమ్మకమూ నన్ను బతికిస్తోంది.

మీరు చెప్పండి మీపై మీకు నమ్మకం లేదా??

మీరూ ఒప్పుకోండి -తుది గెలుపు ఎప్పుడూ నాదీ, మీదీ, మనదేనని! అవును, చెప్పటం మర్చిపోయాను - నా పేరు స్వరాజ్యం!!

– విజయ, డిసెంబర్ 1983